సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 29 | నవంబర్ | 2023



అనుబంధాలపై గునపం పోటు

అన్నదమ్ముల అనుబంధాన్ని ఆస్తి తగాదా చిదిమేసింది. తోడబుట్టిన తమ్ముడినే అన్న హతమార్చేలా చేసింది.



ఊరించి.. ఉసూరుమనిపించి..

ప్రసాద్ పథకం కింద అన్నవరం దేవస్థానానికి రూ.54 కోట్లతో డీపీఆర్ రూపొందించగా.. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.10 కోట్లు మంజూరు చేసి, చేతులు దులుపుకొంది.

8 లో

డెల్టాలకు 3,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 3,600 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు వెయ్యి, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు అంబాజీపేట క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిని స్థానిక క్రీడాప్రాంగణంలో మంగళవారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు మాట్లాడుతూ, ఈ నెల 18, 19 తేదీల్లో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో సబ్ జూనియర్స్ కె.లాస్యార్విక, జి.లాహితీతేజ, క్యాడెట్ విభాగంలో జి.పూజితాదేవి, ఆర్‌హెచ్‌వీ మూర్తి ప్రతిభ చూపారన్నారు. ఈ నలుగురూ వచ్చే నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకూ డెహ్రాడూన్‌లో జరిగే 37వ నేషనల్ సబ్ జూనియర్స్, ఆరో నేషనల్ క్యాడెట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని త్రిమూర్తులు తెలిపారు.

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

రాయవరం: ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు నెలవారీగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెలకు సంబంధించిన జిల్లావ్యాప్తంగా 122 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నారు. ప్రాథమిక, సబ్జెక్టు కాంప్లెక్స్‌ల సమావేశాలు బుధవారం, ఫిజికల్ డైరెక్టర్ల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు గురువారం నిర్వహిస్తారు. జిల్లాలోని 1,579 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు సబ్జెక్టు కాంప్లెక్స్‌లు నిర్వహిస్తున్నారు. కాంప్లెక్స్ సమావేశాల సందర్భంగా పాఠశాలలు మూత పడకుండా, మొదటి రోజు 50 శాతం, రెండో రోజు మిగిలిన 50 శాతం ఉపాధ్యాయులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. సమావేశాలు పకడ్బందీగా జరిగేలా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు పర్యవేక్షించాలని డీఈఓ ఎం.కమల కుమారి ఆదేశాలు జారీ చేశారు. కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించిన అధికారులు ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ నివేదిక నమోదు చేయాలని సూచించారు.

నేడు సత్యదేవుని హుండీ లెక్కింపు

కార్తిక మాసంలో తొలి విడతగా లెక్కింపు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారికి కార్తిక మాసంలో గడచిన 16 రోజుల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించనున్నారు. ఏటా కార్తికంలో రెండుసార్లు అంటే కార్తిక పౌర్ణమి తరువాత, కార్తిక మాసం ముగిశాక హుండీ ఆదాయం లెక్కిస్తారు. దీనికి సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి జరిగే లెక్కింపునకు సిబ్బంది విధిగా హాజరు కావాలని దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. హుండీల ఆదాయం లెక్కింపు సాయంత్రం వరకూ కొనసాగనుంది. గత ఏడాది కార్తికంలో దేవస్థానానికి అన్ని విభాగాల ద్వారా రూ.20 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అందులో హుండీల ద్వారా రూ.3.11 కోట్లు వచ్చింది. ఈ ఏడాది కార్తికంలో రూ.25 కోట్లు పైబడి ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. హుండీల ద్వారా రూ.4 కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. తొలి విడతగా బుధవారం జరిపే లెక్కింపులో సుమారు రూ.1.50 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

కార్డ్ ప్రైమ్ 2.0 ప్రారంభం


కాకినాడ లీగల్: జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం నుంచి కార్డ్ ప్రైమ్ 2.0 విధానం ప్రారంభమైంది. ఇప్పటి వరకూ ఉన్న కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) 1.0 విధానాన్ని ఆధునీకరించి 2.0గా రూపకల్పన చేశారు. కార్డు 1.0లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే డాక్యుమెంట్ వివరాలు నమోదు చేసి, రిజిస్ట్రేషన్ చేసేవారు. కొత్త ప్రైమ్ 2.0 విధానం ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగులు నమోదు చేస్తారు. ఆన్‌లైన్‌లో ఎవరికి వారు సొంతంగా డాక్యుమెంట్ వివరాలు ఆన్‌లైన్ ప్రైమ్‌లో నమోదు చేసుకుని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే నిమిషాల వ్యవధిలో డాక్యుమెంట్ ప్రింట్ తీసి ఇస్తారు. గత విధానంలో డాక్యుమెంట్ సంతకాలు, ఇతర వేలిముద్రలు అన్నీ అయిన తరువాత డాక్యుమెంట్ స్కానింగ్‌కు వారం రోజుల వ్యవధి తీసుకున్నాకే చేతికి డాక్యుమెంట్ వచ్చేది. ఈ విధానంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే చేతికందుతుంది.

తెరమరుగవుతున్న గోదారి



- జిల్లాలో తగ్గిపోతున్న సినిమా షూటింగులు
- ఔట్‌డోర్ షూటింగులతో వ్యయప్రయాసలు
- పల్లె నేపథ్యానికీ కథల్లో తగ్గుతున్న ప్రాధాన్యం
- నాటి సినీ సందడితో ఎంతో మంది కళాకారుల 'తెర'ంగేట్రం





సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒకప్పుడు ఏదో ఒకచోట తరచుగా సినిమా షూటింగులు జరుగుతుండేవి. ఆ పరిసరాల ప్రజలకు కొన్నాళ్ల పాటు ఇదే ముచ్చటగా ఉండేది. కమెడియన్‌ను చూశామనో.. విలన్‌ను పలకరించామనో.. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. ఇప్పుడిది గత వైభవంగా మిగిలిపోతోంది. వెండితెరపై నాడు విరిసిన జిల్లా అందాలు నేడు అంతగా కనిపించడం లేదు. సహజసిద్ధ స్టూడియోగా పేరు సంపాదించిన ఇక్కడి ప్రకృతి అందాలు ఇప్పుడు చిన్నబోతున్నాయి. వ్యయ ప్రయాసలకు భయపడి నిర్మాతలు ఔట్‌డోర్ షూటింగులకు చాప చుట్టేయడమే ఇందుకు కారణంగా నిలుస్తోంది.

ఎందుకిలా అయిందంటే..

చాలా రంగాలను ప్రభావితం చేసిన ఆధునిక సాంకేతికత సినిమాను కూడా తాకింది. గతంలో మాదిరిగా ఆర్టిస్టులందరినీ లొకేషనుకు తీసుకువెళ్లే రోజులు పోయాయి. అందరినీ తీసుకుని వెళ్లాలంటే బస, రవాణా వంటి ఖర్చులతో చాలా బడ్జెట్ అయ్యేది. ఇప్పుడు నిర్మాతలు ఈ విషయంలో పొదుపు పాటిస్తున్నారు. పాత రోజుల్లో సినిమా తీస్తుంటే మొత్తం ఆర్టిస్టులందరూ వచ్చేవారు. ఈ వ్యయం నిర్మాతలకు చాలా భారమయ్యేది. దీనికి తోడు ఎక్కువ సినిమా కథల నేపథ్యం పట్టణాలతో, నగరాలతో ముడిపడి ఉంటోంది. పల్లె కథలు తగ్గిపోతున్నాయి.

90 ఏళ్ల క్రితమే స్టూడియో

సుమారు 90 ఏళ్ల క్రితమే జిల్లాలో సినిమా షూటింగులకు స్టూడియో ఏర్పాటైంది. 1936లో నిడమర్తి దుర్గయ్య ధవళేశ్వరం వద్ద 12 ఎకరాల విస్తీర్ణంలో దుర్గా మూవీ టోన్ స్టూడియో నిర్మించారు. చల్ మోహన్‌రంగా వంటి చిత్రాలు ఇక్కడ తీశారు. ఆరేళ్ల తర్వాత ఆర్థిక ఇబ్బందులతో ఇది మూత పడింది. కానీ జిల్లాలో షూటింగులు మాత్రం కొనసాగాయి.

జిల్లా నుంచి ఎందరికో చాన్స్

జిల్లాలో సినిమా షూటింగుల ప్రభావం ఫలితంగా చాలామంది ఈ రంగానికి వెళ్లాలని ఉత్సాహపడేవారు. దర్శక నిర్మాతలు తరచూ వస్తుండటంతో ఉమ్మడి జిల్లాలోని ఎంతోమంది ఔత్సాహికులకు సినిమా చాన్సులు దక్కాయి. అంజలీదేవి, జయప్రద, సుకన్య, జరీనా వహాబ్, వహీదా రెహమాన్, లలితారాణి వంటి వారు హీరోయిన్లుగా వెలుగొందారు. ఈ జిల్లా నుంచే చెన్నై వెళ్లిన భానుప్రియ మీద కూడా జిల్లాలో జరిగిన సినిమా షూటింగుల ప్రభావమే ఉంది. బాల నటుడిగా ఆలీకి అవకాశమొస్తే ఇప్పుడు అగ్రశ్రేణి కామెడీ నటుడయ్యారు. ఆయనకు ముందు రాజబాబు కూడా కామెడీలో రాణించారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో టికెట్ కలెక్టర్‌గా పని చేసిన రంగనాథ్ ఇక్కడి నుంచే సినిమా రంగంలోకి అడుగు పెట్టారు. ఆదుర్తి సుబ్బారావు, క్రాంతికుమార్, వంశీ, కాశీ విశ్వనాథ్, బాపు, శోభన్, ఎస్వీ కృష్ణారెడ్డి, సుకుమార్ నుంచి మేజర్ డైరెక్టర్ శశికిరణ్ తిక్కా వరకూ ఎందరో ఈ ప్రాంత వాసులు దర్శకులయ్యారు. నట వర్గం గురించి చెప్పుకుంటే జిల్లాకు చెందిన చాలామంది వెండితెరపై బలమైన ముద్ర వేసుకుంటున్నారు. నెమ్మది నెమ్మదిగా షూటింగులు తగ్గిపోవడంతో సినిమాల్లో జిల్లా ప్రాతినిధ్యం కూడా పలుచబడిందనే చెప్పాలి.

ఆదుర్తి నుంచి వంశీ వరకూ..

గోదావరి అందాలను పూర్తి స్థాయిలో వెండితెరకెక్కించిన ఘనత రాజమహేంద్రవరానికి చెందిన ప్రఖ్యాత దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుకు దక్కుతుంది. 1963లో ఆయన తీసిన మూగమనసులు గోదావరి నేపథ్యంలోనే సాగింది. ఈ సినిమా హిట్ కావడంతో తర్వాత ఏదో ఒక విధంగా వెండితెరపై గోదావరి కనువిందు చేస్తూ వచ్చింది. 1963లో దర్శకుడు బాపు సాక్షి సినిమాకు జిల్లాలో ఎక్కువ లొకేషన్లు ఎంపిక చేసుకున్నారు. కృష్ణ హీరోగా నటించిన తొలి చిత్రమిది. 1969లో బుద్ధిమంతుడు, 1973లో అందాల రాముడు తీశారు. మూగమనసులు సినిమాతో గోదావరితో పరిచయమేర్పడిన కె.విశ్వనాథ్‌కు ఈ నదీ తీర ప్రాంతాల్లో షూటింగ్ అంటే ఎంతో ఇష్టం. 1973లో శారద సినిమాను గోదావరి పరిసరాల్లోనే నిర్మించారు. అక్కడి నుంచి వరుసగా తన చిత్రాలన్నింటిలోనూ గోదావరి అందాలను విశ్వనాథ్ తెరకెక్కించారు. దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావు, బాలచందర్ సహా ఎందరో దర్శకులు పోటీ పడి మరీ గోదావరి జిల్లాలో చిత్రాలను నిర్మించారు. దేశంలోని ఇతర భాషా చిత్రాల షూటింగులకు కూడా మన ఉమ్మడి జిల్లా వేదికగా నిలిచింది.

ఔట్‌డోర్ షూటింగ్ ఆకట్టుకుంటుంది



నాలుగు గోడల మధ్య స్టూడియోల్లోనే జరిగే సినిమా షూటింగులను దర్శకుడు బాలచందర్ బయటి ప్రపంచానికి తీసుకువచ్చారు. చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను తెరపై చూపించడం ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. దీంతో ఔట్‌డోర్ షూటింగ్‌లకు ప్రాధాన్యం పెరిగింది. అందుకే నేను నా సినిమాను ఎక్కువగా ఔట్‌డోర్‌లోనే చిత్రీకరించాను. ఉప్పెన సినిమాతో ఉప్పాడలో ఇంత మంచి లొకేషన్లు ఉన్నాయా అంటూ అందరూ అడుగుతున్నారు. నా తొలి సినిమా సొంతూరులోని లొకేషన్లలో తీయడం నా కెరీర్‌ను మలుపు తిప్పింది. జాతీయ స్థాయిలో ఉత్తమ దర్శకుడిగా కూడా నిలబెట్టింది. ప్రస్తుతం జిల్లాలో షూటింగులు తగ్గినప్పటికీ కొద్ది రోజుల్లో పెరిగే అవకాశం ఉందని నమ్ముతున్నాను.

– సానా బుచ్చిబాబు, ఉప్పెన సినిమా దర్శకుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం


రోజుల తరబడి షూటింగులు జరిగేవి



పూర్తి స్థాయిలో ఏ సినిమా తీయాలన్నా ఉమ్మడి గోదావరి జిల్లాలో తగిన లొకేషన్లు ఉన్నాయి. దీన్ని ఇప్పటితరం కంటే నాటి దర్శకులే ఎక్కువగా గ్రహించారు. రోజుల తరబడి షూటింగులు చేసేవారు. పెద్ద ఖర్చు కూడా అయ్యేది కాదు. హీరో హీరోయిన్లతో సహా అనేక మంది నటీనటులు స్థానికంగా కొందరి ఇళ్లలో బస చేసేవారు. వీరికి తమ ఇళ్లలో ఆతిథ్యం కల్పించామని అప్పట్లో గొప్పగా చెప్పుకొనేవారు. షూటింగుల వల్లే జిల్లా నుంచి ఎక్కువ మంది నటులు తయారయ్యారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం నుంచి ఎక్కువ మంది సినిమా రంగంలోకి వెళ్లారు. ఖర్చులు పెరిగిపోతున్నాయని నిర్మాతలు పెద్దగా జిల్లాకు రావడం లేదు.

– జీత్‌మోహన్ మిత్రా, రాజమహేంద్రవరం

వంశీ కేరాఫ్ గోదావరి



రాయవరం మండలం పసలపూడికి చెందిన సుప్రసిద్ధ దర్శకుడు వంశీకి గోదావరి అంటే ప్రాణం. అందుకే ఆయన చిత్రాల్లో గోదావరి అందాలే కాదు భాష, యాస కూడా కనిపిస్తూ మనసును గిలిగింతలు పెడతాయి. కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్ సినిమా పూర్తిగా గోదావరి ప్రాంతంతో ముడిపడిన వినోద భరిత చిత్రం. గోదావరి లేకుండా ఆయన ఏ సినిమా తీయలేదేమో అనిపించేలా జిల్లా లొకేషన్లన్నీ చూపించారాయన.

ఫూలే ఆశయ సాధనకు ప్రభుత్వాల కృషి



ఫూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అమలాపురం రూరల్: మహాత్మా జ్యోతిరావు ఫూలే ఆశయ సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, బడుగు, బలహీనవర్గాల రక్షణ, అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ అన్నారు. ఫూలే వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి మంగళవారం ఆమె పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చదువుతో మహిళలను అభ్యుదయ మార్గంలోకి నడిపించిన ఫూలేను నవ సమాజ నిర్మాతగా, సాంఘిక విప్లవ ఉద్యమానికి వైతాళికునిగా కొనియాడారు. స్త్రీలకు ఫూలే ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారతకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, డీఈఓ కమల కుమారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వై.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువగళం.. విఫలం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: టీడీపీ నాయకుడు నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో ప్రజల ఆదరణ లేక పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో లోకేష్ బహిరంగ సభ ఏర్పాటు చేయకపోవడంతోనే ఆ పార్టీ ఎంత బలహీనంగా ఉందో స్పష్టమైందని అన్నారు. ఈ పాదయాత్రకు డబ్బులిచ్చి జనాలను తీసుకు రావాల్సిన పరిస్థితి స్థానిక నాయకులకు ఎదురైందన్నారు. ఈ యాత్ర ద్వారా టీడీపీ – జనసేన మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్రకు, లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు పొంతనే లేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజారిటీ సాధించి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఇజ్రాయిల్ తెలిపారు.

విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి శ్రీకారం



సబ్ స్టేషన్ పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించడాన్ని వీక్షిస్తున్న ప్రజలు



విద్యుత్ ఉపకేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి, కలెక్టర్ శుక్లా తదితరులు

- రూ.380.12 కోట్లతో అయినవిల్లిలో నిర్మాణం
- తాడేపల్లి నుంచి వర్చువల్‌గా పనులను ప్రారంభించిన సీఎం జగన్
- పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ప్రజాప్రతినిధులు

అయినవిల్లి: జిల్లా వాసులకు విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. అయినవిల్లిలో 21 ఎకరాల్లో 400/132 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించనుంది. రూ.380.12 కోట్లతో చేపట్టనున్న ఈ సబ్ స్టేషన్ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ఈ సబ్ స్టేషన్ నిర్మాణంతో జిల్లా వాసుల విద్యుత్ కష్టాలు తీరనున్నాయని అన్నారు. దీని నిర్మాణం పూర్తయితే జిల్లాలోని అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం, రాజోలుతో పాటు కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, నర్సాపురం విద్యుత్ ఉప కేంద్రాలకు విద్యుత్ సామర్థ్యం మెరుగుపడుతుందని వివరించారు. మొత్తం 25 లక్షల జనాభాకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికాభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. అలాగే, వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. లో ఓల్టేజీ సమస్య కూడా తీరుతుందన్నారు. భవిష్యత్ తరాలకు కూడా విద్యుత్ ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఈ సబ్ స్టేషన్ కోసం పదిహేనేళ్లుగా పోరాడుతున్నామని, ఎట్టకేలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఈ ప్రాంత వాసుల విద్యుత్ కష్టాలు తీరుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంత లంక గ్రామాల వారికి కూడా ఈ సబ్ స్టేషన్ నిర్మాణం వలన ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఏపీ ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, అమలాపురం డీఈ ఎం.రవికుమార్, ఏపీ ట్రాన్స్‌కో 400 కేవీ కన్‌స్ట్రక్షన్స్ ఈఈ శివరామకృష్ణ, డీఈఈ పీవీ మల్లికార్జునరావు స్థానిక ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, సర్పంచ్ కాకర బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీలపై అప్రమత్తం

- అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి
- గెయిల్ మాక్‌డ్రిల్‌లో ఆర్‌డీఓ కేశవవర్ధన్‌రెడ్డి



గ్యాస్ పరిసరాలకు వ్యాపించకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్న సిబ్బంది



మాక్‌డ్రిల్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఆర్‌డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

అల్లవరం: పైపులైన్ నుంచి సహజవాయువు లీకైన సమయాల్లో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో వ్యవహరించాలని అమలాపురం ఆర్‌డీఓ జి.కేశవవర్ధన్‌రెడ్డి అన్నారు. ఓఎన్‌జీసీ, పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులతో గెయిల్ అధికారులు సమన్వయం చేసుకుని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్యాస్ లీకై, అగ్నిప్రమాదం జరిగితే ఎదుర్కోవడం, నియంత్రణపై కేజీ బేసిన్ తాటిపాక బేస్ పరిధిలోని ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో గెయిల్ ఆధ్వర్యాన మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పొలంలో పని చేస్తుండగా అకస్మాత్తుగా గ్యాస్ లీకవడం గమనించిన కూలీలు హెచ్చరిక బోర్డుపై ఉన్న ఎమర్జెన్సీ నంబరుకు సమాచారం అందించడం.. గెయిల్ అధికారులు హుటాహుటిన ఫైర్ ఇంజిన్లను ఘటనా స్థలానికి రప్పించి, అధిక ఒత్తిడితో కూడిన గ్యాస్ పరిసర ప్రాంతాలకు విస్తరించకుండా వాటరింగ్ చేయడం.. రిమోట్ విధానంతో గ్యాస్ సరఫరాను నియంత్రించడం.. అపస్మారక స్థితిలో ఉన్న వారిని సమీప ఆస్పత్రికి తరలించి ప్రాణనష్టం కలగకుండా చర్యలు చేపట్టడం వంటి అంశాలపై గ్రామస్తులకు, రైతులకు ఈ మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. గ్యాస్ దుర్ఘటన సమయాల్లో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేసేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గెయిల్ జనరల్ మేనేజర్ వైఏ కుమార్ మాట్లాడుతూ, కేజీ బేసిన్ పరిధిలో 882 కిలోమీటర్ల పొడవున గ్యాస్ పైపులైన్ ఉందని తెలిపారు. దీని ద్వారా అధిక ఒత్తిడితో గ్యాస్ సరఫరా అవుతుందన్నారు. గ్యాస్ పైపులైన్ నిర్మించిన ప్రాంతాల్లో ఎటువంటి నిర్మాణ పనులు, చెరువుల తవ్వకాలు, యంత్రాలతో పనులు నిర్వహించరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్, జిల్లా అగ్నిమాపక అధికారి పార్థసారథి, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి, పర్యావరణ ఇంజినీర్ సందీప్‌రెడ్డి, అటవీ రేంజ్ అధికారి హరికుమార్, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, తహసీల్దార్ సాంబశివ ప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఓఎన్‌జీసీ ఐఎం గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కొబ్బరి రైతుల ఖాతాల్లో వారం రోజుల్లో నగదు జమ



కొబ్బరిని పరిశీలిస్తున్న ఏపీ ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డి

అంబాజీపేట: నాఫెడ్ కొనుగోలు కేంద్రంలో కొబ్బరి విక్రయించిన రైతుల ఖాతాల్లో వారం రోజుల్లో నగదు జమ చేయనున్నామని ఏపీ ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ వి.చంద్రశేఖరరెడ్డి చెప్పారు. కృషీవల కోకోనట్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యాన అంబాజీపేట మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొబ్బరి విక్రయించిన రైతులకు ప్రతి వారం నగదు చెల్లింపులు జరుగుతాయన్నారు. ఇప్పటి వరకూ 224 టన్నుల కొబ్బరి కొనుగోలు చేశామని, రైతులకు రూ.2.43 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. తొలి విడతగా 60 టన్నుల కొబ్బరికి సంబంధించి, 35 మంది రైతులకు వారంలోగా రూ.65.90 లక్షలు చెల్లిస్తామని తెలిపారు. నాఫెడ్ నుంచి నగదు వచ్చిన వెంటనే మిగిలిన వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. వచ్చే నెలాఖరు వరకూ నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తామని చెప్పారు. జనవరిలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నూతన ధరల ప్రకారం కొబ్బరి కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడినప్పటికీ రైతులకు పూర్తి న్యాయం జరిగేలా కొబ్బరి కొనుగోళ్లకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతుల కొబ్బరి తోటలు ఈ–క్రాపింగ్ జరగకపోయినప్పటికీ రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసిన వివరాల ప్రకారం కొబ్బరి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చంద్రశేఖరరెడ్డి తెలిపారు. అంతకు ముందు నాఫెడ్ కొబ్బరి గోదాములను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాఫెడ్ బ్రాంచి మేనేజర్ టీఎస్ శర్మ, ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు, కృషీవల కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, ముత్యాల జమ్మీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుబంధాలపై గునపం పోటు

- తమ్ముడిని హతమార్చిన అన్న
- గుడివాడలో ఘోరం



సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెద్దాపురం: అన్నదమ్ముల అనుబంధాన్ని ఆస్తి తగాదా చిదిమేసింది. తోడబుట్టిన తమ్ముడినే అన్న హతమార్చేలా చేసింది. పెద్దాపురం మండలం గుడివాడలో ఈ ఘోరం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లంశెట్టి త్రిమూర్తులు, ఉదయ్ భాస్కర్ (55) అన్నదమ్ములు. వారసత్వంగా వచ్చిన ఎకరం పొలం కోసం వీరిద్దరి మధ్య మూడు నెలలుగా తగాదా జరుగుతోంది. వీరి మధ్య మంగళవారం ఉదయం కూడా తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఇద్దరి మధ్య ఆవేశకావేశాలు పెరిగాయి. ఈ క్రమంలో అన్న త్రిమూర్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. విచక్షణ కోల్పోయి తమ్ముడు ఉదయ్ భాస్కర్‌పై ఒక్కసారిగా దాడి చేసి, గునపంతో పొడిచాడు. ఈ దాడిలో ఉదయ భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పెద్దాపురం సీఐ రవికుమార్, ఎస్సై వి.సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు త్రిమూర్తులు కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



గోదావరిలో పడిన వాటర్ ట్యాంకర్

తాళ్లపూడి: బల్లిపాడు ఇసుక ర్యాంపు వద్ద వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ అదుపు తప్పి, గోదావరిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై కె.వెంకట రమణ కథనం ప్రకారం.. గజ్జరం గ్రామానికి చెందిన కమిడి దుర్గారావు (50) వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌తో ర్యాంపులోకి వెళ్తున్నాడు. ఆ క్రమంలో ఆ ట్రాక్టర్ అదుపు తప్పి గోదావరిలోకి దూసుకువెళ్లింది. ట్రాక్టర్ సహా దుర్గారావు గోదావరిలో మునిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సంఘటన జరిగిన ప్రదేశం ఏ మండల పరిధిలోకి వస్తుందనే అంశంపై చిడిపి, వేగేశ్వరపురం, బల్లిపాడు వీఆర్‌ఓలు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల పోలీసులు మల్లగుల్లాలు పడ్డారు. చివరకు తాళ్లపూడి మండలమని నిర్ధారించారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..

- 'ప్రసాద్' నిధులపై నిరాశపరచిన కేంద్రం
- అన్నవరం దేవస్థానానికి మూడేళ్ల క్రితమే రూ.54 కోట్లతో డీపీఆర్
- ఇదిగో అదిగో అంటూ చివరకు రూ.10 కోట్లకు కుదింపు
- ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారుల అసంతృప్తి



అన్నవరం: దఫదఫాలుగా కేంద్ర అధికారుల పర్యటనలు.. ప్రజాప్రతినిధులతో సమావేశాలు.. ఎన్నో వడపోతలు.. మరెన్నో మార్పులు.. ఇలా కేంద్ర పర్యాటక శాఖ ఎంతో హడావుడి చేసింది.. అన్నవరం దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు చేసేస్తామంది.. రూ.54 కోట్లతో డీపీఆర్ కూడా తయారైంది.. ఇంత హడావుడీ చేసి.. చివరకు ఓ రూ.10 కోట్లు మాత్రమే విదిలించాలని నిర్ణయించింది. ఇదిగో అదిగో అంటూ ఊరించి.. చివరకు ఉసూరుమనిపించేలా కేంద్రం తీసుకున్న నిర్ణయం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను, అధికారులను అసంతృప్తికి గురి చేసింది.

హడావుడి చేసి.. ఆశలపై నీళ్లు జల్లి..

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత.. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పిలిగ్రిమేజ్ రిజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీము ప్రారంభించింది. తొలి దశలో ఉత్తరాది రాష్ట్రాల్లోని వారణాసి, మధుర తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేశారు. రెండో దశలో అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానాన్ని 2016లో ఎంపిక చేశారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు కోరారు. దీనిపై అన్నవరం దేవస్థానం రూ.96 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.

ఈ ప్రతిపాదనలపై నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల ఉన్నతాధికారులు.. కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓలతో దఫదఫాలుగా సమావేశాలు నిర్వహించారు. దేవస్థానానికి అత్యంత అవసరమైన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర పర్యాటక అధికారులు రూ.54 కోట్లతో డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేశారు. దీనికి రాష్ట్ర పర్యాటక, అన్నవరం దేవస్థానం అధికారులు అంగీకరించారు. దీనిపై కేంద్ర పర్యాటక శాఖ అధికారులు తుది నివేదిక రూపొందించి, గత ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి ఆమోదానికి పంపించారు. అక్కడ సంబంధిత ఫైలు పెండింగ్‌లో ఉండటంతో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం అధికారులు 2021లో కిషన్‌రెడ్డిని కలిసి, ప్రసాద్ స్కీము కింద రూపొందించిన డీపీఆర్ మేరకు నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై అప్పట్లో కేంద్ర మంత్రి సానుకూలంగానే స్పందించారు. అయినప్పటికీ చివరకు ఈ పథకం కింద రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం సమాచారం పంపడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.



ప్రసాద్ స్కీము డీపీఆర్‌పై ఉత్తర్వులివ్వాలని 2021లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, దేవస్థానం అధికారులు (ఫైల్)

నిధుల పెంపుపై కేంద్ర మంత్రిని కలవాలని యోచన

డీపీఆర్ ప్రకారం ప్రసాద్ స్కీము కింద రూ.54 కోట్లు మంజూరైతే ప్రతిపాదించిన పనులన్నీ చేయాలనుకున్నారు. తీరా ఇప్పుడు రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తూండటంతో ఈ పనులన్నీ దేవస్థానమే సొంతంగా చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయాలని కోరేందుకు తెలంగాణ ఎన్నికల అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మరోసారి కలవాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు యోచిస్తున్నట్లు సమాచారం. ప్రసాద్ స్కీము కింద రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తే కేవలం అన్నదాన భవనం మాత్రమే నిర్మించాలని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

ప్రసాద్ స్కీము ప్రతిపాదనలివీ..

- ప్రసాద్ స్కీము నిధులు వస్తే రూ.30 కోట్లతో ప్రకాష్ సదన్ సత్రం వెనుక మూడంతస్తుల్లో అన్నదాన భవనం నిర్మాణం.
- టీటీడీ సత్రం స్థలంలో మూడంతస్తుల వ్రత మండప నిర్మాణం.
- రూ.8.5 కోట్లతో కొండ దిగువన డార్మెట్రీ.
- వనదుర్గ ఆలయం నుంచి మొదటి ఘాట్ రోడ్డును కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణం.
- వ్రత మండపం నుంచి సత్యదేవుని ఆలయం వరకూ భక్తుల నడక దారి అభివృద్ధి.
- భక్తులు క్యూలో అరగంట కన్నా ఎక్కువ సమయం నిలబడకుండా టీటీడీ తరహాలో కంపార్ట్‌మెంట్ల ఏర్పాటు.
- అన్నదానంలో మెకనైజ్డ్ కుకింగ్.
- భక్తుల కోసం బ్యాటరీ కార్లు.

చెత్త కుప్పలో భారీ పేలుడు

- చలి కాగేందుకు వెళ్లి, గాయపడిన బాలురు
- ఐదుగురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలు
- మామిడాడలో దుర్ఘటన

జగ్గంపేట/ప్రత్తిపాడు/కాకినాడ క్రైం: మండుతున్న చెత్త కుప్ప వద్దకు చలి కాగుదామని ఆ పిల్లలు వెళ్లారు. అంతలోనే ఊహించని విధంగా అక్కడ భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఐదుగురు బాలురు తీవ్రంగా గాయపడి, ఆసుపత్రి పాలయ్యారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటన.. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మామిడాడ దళితవాడకు చెందిన కొంత మంది బాలురు.. అక్కడకు సమీపాన ఉన్న ఏలేరు కాలువలో స్నానాలకు సోమవారం సాయంత్రం వెళ్లారు. కొంత మంది పిల్లలు స్నానాలు చేసి బయటకు వచ్చారు. అక్కడే ఉన్న చెత్త కుప్ప వద్ద మంట వస్తూండటంతో చలి కాగేందుకు గుమిగూడారు. అదే సమయంలో ఆ మంటల్లో నుంచి ఊహించని విధంగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఆ పేలుడు ధాటికి ఒక్కసారిగా నిప్పురవ్వలు మీద పడటంతో ఐదుగురు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో జంగం ఏసుబాబు, చింతపల్లి ఆనంద కుమార్, మందా శాంతిరాజు, ఉప్పాడ రామచరణ్, ఉప్పాడ మురళి తీవ్రంగా.. సన్నపు కార్తీక్, మడికి ఉదయ్ కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. వీరందరూ 10 నుంచి 16 సంవత్సరాల వయస్సున్న పిల్లలు. ఐదు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్నారు. పేలుడు సంఘటనతో దళితవాడ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. స్థానికులు పరుగు పరుగున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే తొలుత ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు మంగళవారం సాయంత్రం తరలించామని ప్రత్తిపాడు సీహెచ్‌సీ ఆర్‌ఎంఓ కన్యాకుమారి తెలిపారు. గాయపడిన బాలుర ఒంటిపై కాలిన బొబ్బలు అధికంగా ఉన్నాయని చెప్పారు. స్వల్పంగా గాయపడిన సన్నపు కార్తీక్, మడికి ఉదయ్ కుమార్‌లను ప్రథమ చికిత్స అనంతరం స్వగ్రామానికి తీసుకువచ్చారని గ్రామ కార్యదర్శి ఎ.శేషగిరిరావు తెలిపారు.

గాయపడిన ఐదుగురు బాలురను బర్న్స్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, ఆర్‌ఎంఓ డాక్టర్ రాహుల్ తెలిపారు. బాధిత బాలలకు అందిస్తున్న వైద్య సేవలను ఆసుపత్రి ఉన్నతాధికారులు నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నారు.



పేలుడు సంభవించిన చెత్తకుప్ప



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలురు

క్వారీ బాంబే కారణమా?

ఈ సంఘటనలో త్రుటిలో ఘోర ప్రమాదమే తప్పిందని స్థానికులు అంటున్నారు. దీపావళి పండగ నేపథ్యంలో ఎవరైనా ఆ చెత్తలో బాంబుల వంటివి పడవేసి ఉంటారని భావించారు. కానీ, పేలుడు తీవ్రత చూస్తే దీపావళి బాణసంచా కాదేమోనని, క్వారీలో ఉపయోగించే బాంబు కారణమై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేలుడు జరిగిన మామిడాడ గ్రామం ఏలేశ్వరానికి దగ్గరగా ఉంది. ఇక్కడ క్వారీల్లో రాళ్లు బద్దలుగొట్టడానికి శక్తిమంతమైన బాంబులు వాడుతూంటారు. వాటిని అక్రమ మార్గంలో తీసుకువచ్చి, ఏలేరు కాలువ సమీపంలో కొప్పెట్టి పేలుస్తున్నారని.. తద్వారా కాలువలో నీరు పెద్ద ఎత్తున పైకి లేచి పడి, చేపలు బయటకు వస్తూంటాయని.. ఇది చేపలు పట్టేవారికి అనువుగా ఉంటోందని చెబుతున్నారు. ఇటువంటి బాంబును ఎవరైనా ఆ చెత్తకుప్పలో దాచి ఉంటారని, చెత్తకు ఎవరో నిప్పు పెట్టడం వల్ల అది పెద్ద శబ్దంతో పేలి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చెత్తకుప్పలో జరిగిన భారీ పేలుడుకు కారణాలేమిటో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాధితులకు లోకేష్ 'గ్యాస్' కబుర్లు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ నేత నారా లోకేష్ 'గ్యాస్' కబుర్లు చెబుతున్నారని ఎమ్మెల్సీ, సిటిజన్స్ యాంటీ పొల్యూషన్ సొసైటీ చైర్మన్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురం హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. నగరం గ్రామంలో 22 మంది మృత్యువాత పడిన గ్యాస్ విస్ఫోటనం సంఘటన టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని లోకేష్‌కు గుర్తు చేశారు. నగరం గ్యాస్ విస్ఫోటన బాధితులకు న్యాయం చేస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ అనడాన్ని కుడుపూడి ఎద్దేవా చేశారు. ఏ ముఖం పెట్టుకుని ఈ హామీ ఇచ్చారని విమర్శించారు. గ్యాస్ విస్ఫోటనం జరిగినప్పుడు టీడీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిగా ఉన్న ఈ ప్రాంతానికి చెందిన నిమ్మకాయల చినరాజప్ప కనీసం ఆ సంఘటనకు బాధ్యులను కూడా అరెస్టు చేయించలేకపోయారని గుర్తు చేశారు. దీనికి బాధ్యులైన సంస్థ అధికారులతో అప్పటి టీడీపీ ప్రభుత్వం కుమ్మక్కై, కేసును నీరుగార్చిందని అన్నారు. సిటిజన్స్ యాంటీ పొల్యూషన్ సొసైటీ పేరుతో తాను ఉద్యమాలు చేసినా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. 'ఇంటర్నేషన్ కోర్టు ఆఫ్ లా'కు అప్పట్లో వెళ్దామనుకున్నా లాయర్లకు రూ.లక్షలు వెచ్చించే స్తోమత లేక ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చుకుంటూ వచ్చామని సూర్యనారాయణరావు అన్నారు.



ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

రేపు అయినవిల్లి వినాయకునికి అభిషేకం

ఆత్రేయపురం: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద గురువారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి, అభిషేకం, హోమం, వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ క్రతువులను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గ్రామగ్రామానా హిందూ ధర్మం, సనాతన ధర్మ విస్తృత ప్రచారంలో భాగంగా రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ చేపట్టిన ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఈ క్రతువులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆత్రేయపురం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు తదితరులు మంగళవారం పర్యవేక్షించారు. గ్రామగ్రామానా ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని రుద్రరాజు రమేష్‌రాజు తెలిపారు.

5 నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో రీజినల్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లోని బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలురకు చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు; బాలికలకు చెస్, వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. స్పోర్ట్స్ అథ్లెటిక్స్‌లో బాలురకు 13, బాలికలకు 10 ఈవెంట్లలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

8 మంది ఈఓల నియామకం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన 8 మందిని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ఆలయాల్లో ఈఓలుగా నియమించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు మంగళవారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. వేమగిరి గ్రూపు దేవస్థానాలకు సీహెచ్ సూర్యారావు, ఐ.పోలవరం గ్రూపు దేవస్థానాలకు ఎం.సూర్య రమణి, కరప గ్రూపు దేవస్థానాలకు కె.తిరుమల రవితేజ, ఆత్రేయపురం గ్రూపు దేవస్థానాలకు బి.నరేంద్ర కుమార్, యు.కొత్తపల్లి గ్రూపు దేవస్థానాలకు బి ధనలక్ష్మి, ఏలేశ్వరం మండలం సిరిపురం శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి జి.అశ్విని, రాజమహేంద్రవరం వేంకటేశ్వరస్వామి మఠానికి పి.ప్రియదుర్గ, గోపాలపురం గ్రూపు దేవాలయాలకు బి.కిరణ్‌లను ఈఓలుగా నియమించామని వివరించారు. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.

కూల్‌డ్రింక్ అనుకుని.. పురుగు మందు తాగాడు

ఆత్రేయపురం: ర్యాలికి చెందిన తోరాటి భానుశ్రీను (28) కూల్‌డ్రింక్ అనుకుని పురుగు మందు తాగి మృతి చెందాడు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. భానుశ్రీను సోమవా రం జేసీబీపై పని చేస్తున్నాడు. ఆ సమయంలో కూల్‌డ్రింక్ అనుకుని పురుగు మందు తాగాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి వీరవేణి ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు అభినందనీయం

- హోం మంత్రి తానేటి వనిత
- లబ్ధిదారులకు రూ.101 కోట్ల రుణ మంజూరు పత్రాల పంపిణీ
- కిసాన్ ఫఖ్వాడా ద్వారా 10 వేల మంది రైతులకు చేరువ
- కొవ్వూరులో బ్యాంకు పక్షోత్సవాలు ప్రారంభం



రైతులకు రుణాల చెక్కు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత. చిత్రంలో బ్యాంకు సీజీఎం దినేష్ పంత్ తదితరులు

కొవ్వూరు: అగ్రి ఫెస్టివల్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బరోడా కిసాన్ పఖ్వాడా ద్వారా 10 వేల మంది రైతులకు సేవలందించాలని లక్ష్యంగా పెట్టుకోవడం అభినందనీయమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా కిసాన్ పఖ్వాడాను కొవ్వూరులోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ, అగ్రి ఫెస్టివల్ పేరిట వ్యవసాయ కార్యక్రమాలతో పాటు వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, పథకాలపై రెండు వారాల పాటు బ్యాంకు అవగాహన కల్పిస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు రూ.1.35 కోట్లు ఇన్సూరెన్సు కవరేజీను బ్యాంకు ఆఫ్ బరోడా ప్రవేశపెట్టిందని చెప్పారు. అసాధారణమైన ఈ ప్యాకేజీని వినియోగించుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీసు జీతాల ప్యాకేజీకి ఈ నెల 23న రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఎంఓయూను మంత్రి ఆవిష్కరించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) దినేష్‌పంత్ మాట్లాడుతూ, మేళా ద్వారా లబ్ధిదారులకు రూ.101 కోట్ల రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ హైదరాబాద్ జోన్‌లో 413 శాఖలున్నాయని, వీటిలో 207 సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. వ్యవసాయ రంగానికి అందించిన రుణాలు సెప్టెంబర్ 30 నాటికి 21 శాతానికి పెరిగాయన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేశారు.

హైదరాబాద్ జోనల్ హెడ్ రితేష్ కుమార్ మాట్లాడుతూ, జోన్‌లో ఈ ఏడాది 50 పైగా బరోడా బ్యాంకు శాఖల ద్వారా రైతు సమావేశాలు, కిసాన్ మేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. గత ఏడాది హైదరాబాద్ జోన్‌లో కిసాన్ పఖ్వాడా సందర్భంగా 300కు పైగా కిసాన్ మేళాలు, ఈవెంట్లు నిర్వహించామని, రూ.288 కోట్ల వ్యవసాయ రుణాలు అందించామని తెలిపారు. రైతులకు మరింత చేరువై ఘర్-ఘర్ కేసీసీ అభియాన్ పేరుతో కిసాన్ క్రెడిట్ కార్డుల డ్రైవ్ నిర్వహించనున్నామని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ పథకాలను ప్రోత్సహించడానికి కూడా ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. అంతకు ముందు ఫంక్షన్ హాలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి వనిత ప్రారంభించారు. రైతులకు ట్రాక్టర్లు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, బ్యాంకు ఎన్‌డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, డిప్యూటీ జీఎం చందన్ సాహో, ఏజీఎం కె.విజయరాజు, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, అక్షయ పాత్ర శ్రీనివాస రవీంద్ర, గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

30 వరకూ అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ నియామకాలకు ఈ ఏడాది జూలై 18న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. మెడికల్ ఆఫీసర్ (డీటీసీ)-2, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్-2, డాట్స్ ప్లస్ హెచ్‌ఐవీ సూపర్‌వైజర్-2, పీపీఎం కో ఆర్డినేటర్-2, అకౌంటెంట్-2 పోస్టుల మెరిట్ జాబితాను ఎన్‌ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరసింహ నాయక్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల ద్వారా జాబితా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాలుంటే బుధవారం ఉదయం 10.30 నుంచి గురువారం సాయంత్రం 5 గంటలలోపు కాకినాడలోని తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

నేడు నన్నయలో సెమినార్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ ఇన్ యాక్షన్ (ఎస్‌సీఆర్‌ఏ) యూఎస్‌ఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభం కానుంది. స్పృహ సైకాలజీ అలుమ్నీ అసోసియేషన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020, డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ, జీఎస్‌ఎల్ సంయుక్త సహకారంతో 'గ్లోబల్ పీస్ అండ్ హెల్త్ మార్జినైజేషన్ – ఎ కమ్యూనిటీ పెర్‌స్పెక్టివ్' అనే అంశంపై ఈ సెమినార్ జరగనుంది. విశ్వశాంతికి వ్యక్తిగత, సామాజిక, ఆరోగ్యకర జీవన విధానానికి కమ్యూనిటీ సైకాలజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు.